క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా



సామర్లకోట పీడబ్ల్యూ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైల్వే ఉద్యోగులు

సామర్లకోట: రైల్వేలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, రైల్వే ప్రైవేటీకరణ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పీడబ్ల్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ట్రాలీమెన్లు, గ్యాంగ్‌మెన్‌లకు భద్రత పెంచాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ ఎం.రవికుమార్, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, యూనియన్ ప్రతినిధులు ఏవీవీ సత్యనారాయణ, సీహెచ్ రాంబాబు, శ్రీనివాస్, దేవిప్రసాద్, నూకరాజు, రాజబాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఇందన ప్రసాద్(ఫైల్)

సామర్లకోట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్థానిక కొత్తూరు వీధికి చెందిన ఇందన ప్రసాద్(36) కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అచ్చంపేట ఏడీబీ రోడ్డులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొనడంతో ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తిమ్మాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి నేడు ఎంపికలు

కొత్తపల్లి: వైఎస్సార్ జిల్లాలో ఉన్న వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ఉన్న 4, 5 తరగతులలో ప్రవేశాలకు మండల స్థాయిలో గురువారం స్థానిక జెడ్పీ పాఠశాలలో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఈఓ పీఆర్డీ భాస్కరరావు బుధవారం తెలిపారు. మండలంలోని ఎంపికైన వారికి జిల్లా స్థాయిలో కాకినాడలో ఈ నెల 23న ఎంపిక జరుగుతుందన్నారు. ఈ ప్రవేశాలకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట జనన ధ్రువపత్రం, పాసుపోర్టు సైజు ఫొటో, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

రైతులకు చిరుసంచుల పంపిణీ



రైతులకు వరి విత్తనాలు అందిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తపల్లి: మండలంలోని కుతుకుడుమిల్లిలో బుధవారం పెద్దాపురంలో ఉన్న ఏరువాక శాస్త్రవేత్తలతో చౌడునేలను తట్టుకునే చిరు సంచులు (వరి విత్తనాలు) పంపిణీ చేశారు. పిఠాపురం ఏడీఏ స్వాతి ఆధ్వర్యంలో రైతులకు అందించారు. శాస్త్రవేత్తలు రైతులకు పలు రకాల వరి విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సీతారామశర్మ, బాలజీ నాయకర్, ఏరువాక కో ఆర్డినేటర్ నరసింహారావు, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరకల పేరుతో మట్టి తవ్వకాలు

కొత్తపల్లి: మండల పరిధిలో పలు గ్రామాల్లో రైతులు తమ పొలాలను మెరకల పేరుతో మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు. తవ్విన మట్టిని ఇటుకుల బట్టీలకు, ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా గోర్స, కొండెవరం, రమణక్కపేట గ్రామాల్లో మట్టి దందా జోరుగా సాగుతోంది. రెవెన్యూ అధికారులు మాత్రం పొలాల్లో తవ్వే మట్టిని పల్లం–మెరకలు సరిచేసుకునేందుకు మాత్రమే అనుమతులు ఉంటాయన్నారు. ముఖ్యంగా ఇటుకల బట్టీలకు మట్టిని జోరుగా తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని కోరుతున్నారు. దీనిపై తాహసీల్దార్ ప్రసాద్‌ను వివరణ కోరగా మండలంలో మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవన్నారు.

పేకాట శిబిరాలపై దాడులు

సామర్లకోట: మండల పరిధిలోని నవర గ్రామ శివారు చెరువుగట్టుపై పేకాట ఆడుతున్న శిబిరంపై సీఐ కె.దుర్గాప్రసాద్ తన బృందంతో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.5,600 స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాలో పేకాట ఆడుతున్న శిబిరంపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.32,240 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బుధవారం కోర్టుకు తరలించామని సీఐ దుర్గాప్రసాద్ చెప్పారు.

భూసారానికి సెగ



మంట పెట్టిన వరి పొలం

- మిత్ర జీవులు నశించే అవకాశం
- కలియదున్నడం వల్ల సత్ఫలితాలు

పిఠాపురం: సాగుకు భూమిని సమాయత్తం చేసే క్రమంలో మిగిలి పోయిన గత పంట అవశేషాల తొలగింపునకు మంట పెట్టడం మంచిది కాదని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. డివిజన్‌లో 16,882 హెక్టార్లలో వరి సాగవుతుండగా ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పొలాల్లో మంట పెట్టవద్దని అధికారులు సూచిస్తున్నారు.

మంట పెట్టడం భూమికి హాని..

గడ్డి దుబ్బులకు మంట పెట్టడం వల్ల భూమిలో ఉండే గాలి నీరు కోతకు గురై సారం తగ్గిపోతుంది. భూమిలో సారం పెంచే బ్యాక్టీరియా, ఫంగస్, సూక్ష్మజీవులు నశించిపోయి దిగుబడి తగ్గిపోతుంది. గడ్డి దుబ్బులకు మంట పెట్టడం వల్ల గ్రీన్‌హౌస్ గ్యాస్ విడుదలై భూ ఉష్ణోగ్రత పెరిగి రానున్న పంటలపై ప్రభావం చూపుతుంది. వాతావరణ కాలుష్యం పెరిగి పొగమంచు ఏర్పడి పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుంది.

ఇలా చేస్తే మంచిది..



రైతులు పంట వ్యర్థాలను తొలగించడానికి రోటోవేటర్, బేలర్ వంటి పరికరాలను ఉపయోగించి తొలగించుకోవాలి. వీటిని ప్రభుత్వం రాయితీపై అందజేస్తుంది. మిగిలిపోయిన గడ్డిని దుబ్బులను భూమిలో కలియదున్నడం వల్ల భూమి సారవంతంగా తయారై దిగుబడులు పెరుగుతాయి. సేంద్రియ కార్బన్ పెరుగుతుంది. పంట వ్యర్థాలు త్వరగా కుళ్లి పోయే ప్రక్రియను వేగవంతం చేయడానికి బయో డీ కంపోజర్‌ను ఉపయోగించుకోవాలి. బయో గ్యాస్ ప్లాంట్ ద్వారా పంట అవశేషాలను కాల్చడాన్ని అరికట్టవచ్చు. వేస్టు టూ ఎనర్జీ మిషన్ ద్వారా ఈ ప్లాంట్‌లను ప్రభుత్వం అందజేస్తుంది. రైతులు వ్యవసాయశాఖాధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు పాటించడం ద్వారా స్థిరమైన వ్యవసాయ వ్యర్థాలను నిర్వహించే పద్ధతులు పాటించాలి. తద్వారా నేల సారవంతమై కంపోస్టు పెరిగి భూమికి మరింత బలం చేకూరుతుంది. – పి.స్వాతి, ఏడీఏ, పిఠాపురం

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు

పెద్దాపురం: రక్తదానం చేయడమంటే ప్రాణదానం చేసినట్టేనని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అన్నారు. యాసలపు సూర్యారావు 11వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు మాట్లాడుతూ సూర్యారావు సేవా కార్యక్రమాల్లో ముందుండేవారని, ఆయన ఆశయాలను కొనసాగించాలని కొనియాడారు. అనంతరం పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, నీలపాల సూరిబాబు, తైనాల శ్రీను, రవి, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయండి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జితేంద్ర

పెద్దాపురం: వచ్చే నెల నుంచి ప్రతి గ్రామంలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని పెద్దాపురం తహసీల్దార్ వి.జితేంద్ర అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని కట్టమూరు, జె.తిమ్మాపురం, వాలుతిమ్మాపురం తదితర గ్రామాల వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జితేంద్ర మాట్లాడుతూ లబ్ధి పొందని వారిని గుర్తించి ప్రతి ఒక్కరికి సంక్షేమం అందేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి దొరబాబు, రాధాకృష్ణ, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకోవాలి



రైతులకు విత్తనాలు అందజేసిన రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

సామర్లకోట: విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకోవడం ద్వారా దిగుబడి పెరగడానికి అవకాశం ఉంటుందని రిలయన్స్ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ ఎస్.చిట్టిబాబు అన్నారు. బుధవారం వీకే రాయపురంలో జిల్లా వ్యవసాయశాఖ, రిలయన్స్ ఫౌండేషన్స్ సంయుక్తంగా విత్తన ఉత్పత్తి, విత్తన శుద్ధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విత్తన శుద్ధి చేసుకున్న విత్తనాలను పొలంలో చల్లుకోవడం వల్ల తొలిదశలో ఆశించే వేరుకుళ్లు తెగులు, అగ్గి తెగ్గులు, మాగుడు తెగులు పంట దరి చేరకుండా ఉంటాయన్నారు. అనంతరం రైతులకు విత్తనాలు అందజేశారు. కార్యక్రమానికి మండల వ్యవసాయ విస్తరణాధికారి సతీష్ అధ్యక్షత వహించగా రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆర్.సుబ్రహ్మణ్యంనాయుడు, బత్రే నాగేశ్వరరావు, వీపీఏ జి.శ్రీలక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

సామర్లకోట: పట్టణ యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్సియల్ లిటరసీ–2023 పట్టణ, మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన రేగుళ్ల రాబర్ట్‌రాజ్, శ్యామ్ కిషోర్‌లు ప్రథమ స్థానం సాధించారు. మాధవపట్నం హైస్కూల్‌కు చెందిన కేజే ప్రణతి, జి.ఆదిత్యరామ్‌లకు ద్వితీయ, ఉండూరు హైస్కూల్‌కు చెందిన శ్రీదేవి, సాత్వికలు తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. క్విజ్ పోటీలకు రామనారాయణ గైడ్ టీచరుగా వ్యవహరించారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.5 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు యు.సత్యనారాయణ, ఎన్.కొండారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టేషన్‌మాస్టర్లకు అత్యవసర పనులపై అవగాహన



రైలు పాయింట్స్‌లో ఇబ్బందులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సామర్లకోట: స్థానిక రైల్వేస్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్టేషన్‌మాస్టర్లు, పాయింట్స్ మాన్‌లకు అత్యవసర పనులపై బుధవారం అవగాహన కల్పించారు. రైల్వే విద్యుత్ లైన్ల(ఓహెచ్‌ఈ) సప్లయ్ ఒక లైను నుంచి మరో లైన్‌కు మార్చే సమయంలో, రైలు పాయింట్స్‌లో ఇబ్బందులు ఎదురైనపుడు ఎలాంటి చర్యలు చేపట్టాలో రైల్వేస్టేషన్ మేనేజరు ఎం.రమేష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, సిగ్నల్, ఓహెచ్‌ఈ సిబ్బంది అవగాహన కల్పించారు. ఉద్యోగ జీవితంలో ఎల్లప్పుడూ రైళ్లు, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని స్టేషన్ మేనేజర్ రమేష్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉద్యోగులకు సూచించారు.

ముందస్తు నారుమడులు వేయాలి

- జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయ్‌కుమార్
- గతం కంటే ఈ ఏడాది దిగుబడి పెరగాలి
- హైబ్రీడ్ వంగడాలను ఎంపిక చేసుకోవాలి



ఈకేవైసీ విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయ్‌కుమార్

పిఠాపురం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి నుంచే నారుమడులు వేసుకునేలా రైతులను సన్నద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మండలం కందరాడ రైతు భరోసా కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది దిగుబడులు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మేలైన అధిక దిగుబడులు వచ్చే హైబ్రీడ్ వంగడాలను ఎంపిక చేసుకునేలా రైతులకు సూచనలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ముందుగానే నారుమళ్లు వేసుకోవడం వల్ల పంట అక్టోబర్‌లో చేతికందే అవకాశం ఉంటుందని, తద్వారా ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ ఏర్పడుతుందన్న విషయాన్ని రైతులకు వివరించాలన్నారు. ముందుగా నారుమళ్లు వేసుకోవడం వల్ల మూడు పంటలు పండే అవకాశం ఉందని రైతులకు వివరించాలన్నారు. ఆలస్యంగా నారుమళ్లు వేస్తే అధిక వర్షాలు, తుఫాన్లు వచ్చే సమయానికి పంట చివరి దశకు చేరుకుని నష్టాలు చవి చూడాల్సి వస్తుందన్న విషయాన్ని రైతులకు వివరించి త్వరగా నారుమళ్లు వేసుకునేలా చూడాలన్నారు.

అలాగే రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. రైతు భరోసా కేంద్రాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి బిల్లులు లేకుండా ఏ దుకాణంలోను విత్తనాలు కొనుగోలు చేయరాదన్న విషయాన్ని వివరించి అలా చేయడం వల్ల నష్టం వస్తే పరిహారం రాదని రైతులకు తెలియజేయాలన్నారు. విత్తనాలు అధిక రేట్లకు విక్రయించకుండా పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి రైతు విత్తనశుద్ధి చేసేలా సూచనలు ఇవ్వడంతో పాటు కచ్చితంగా చేసేలా చూడాలన్నారు. సమీకృత వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల కలిగే లాభాలు రైతులకు వివరించాలని ఆయన సూచించారు. ప్రతి కౌలు రైతుకు సాగుహక్కు కార్డు పొందేలా తెలియజేసి అందరు పొందేలా చూడాలన్నారు. ఈనెల 25 లోపు పీఎం కిసాన్ సొమ్ము పడని అందరు రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పిఠాపురం వ్యవసాయశాఖ ఏడీఏ పి.స్వాతి, నియోజకవర్గ వ్యవసాయశాఖాధికారులు, ఆర్బీకే సిబ్బంది తదితరులున్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆదేశించారు. మండలంలోని ఇండుగపల్లిలో బుధవారం జగనన్న సురక్ష పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అర్హతలు ఉండి గతంలో పథకాలు పొందని వారికి పథకాలు వర్తింపజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన ధ్రువపత్రాలను ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేస్తుందన్నారు. మండల ఎంఎల్‌ఓ నూతన ప్రసాద్ సురక్ష పథకం విధివిధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు కుంచే సత్యవతి, సుర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే అచ్చిరాజు, పంచాయతీ కార్యదర్శి రావాడ రామచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సచివాలయాల్లో ఉచిత సేవలు

తుని: జగనన్న సురక్ష పథకంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజలకు పలు ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తామని కమిషనర్ ప్రసాదరాజు బుధవారం తెలిపారు. ఈ నెల 23 నుంచి నెల రోజుల పాటు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులకు సంబంధించి కుల, నివాస, ఆదాయ, డీటీబీ, మ్యూటేషన్ ఫర్ ట్రానాక్షన్, ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ అనుసంధానం తదితర సేవలు ఉచితంగా పొందవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీవెంకటప్రసాద్ తదితరులు

కాకినాడ సిటీ: జీ–20 ఈవెంట్లలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జాతీయ స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తోందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ చందాల శ్రీవెంకట ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా బుధవారం జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జిల్లా లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మండల స్థాయి పోటీలను నిర్వహించినట్టు తెలిపారు. ఈనెల 28న జిల్లా స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు శ్రీవెంకటప్రసాద్ తెలిపారు.

సంగీతంతో మానసిక ప్రశాంతత

- రాయవరపు సత్యభామ
- ఉత్సాహంగా ప్రపంచ సంగీత దినోత్సవం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తోన్న కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు సత్యభామ తదితరులు

కాకినాడ కల్చరల్: సంగీతం మానసిక ప్రశాంతతను పెంపొందిస్తుందని రాయవరపు సత్యభామ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు ఆర్.సత్యభామ అన్నారు. స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తి రస సంగీత సంస్థ ఆడిటోరియంలో కళావేదిక సౌజన్యంతో బుధవారం సాయంత్రం ప్రపంచ సంగీత దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సంగీతానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని సత్కళా వాహిని వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు అన్నారు. తదుపరి మంజరి సంగీత కళాశాల విద్యార్థులు చేసిన సంగీత కచేరి అలరించింది. అన్నమయ్య, త్యాగరాజు తదితర వాగ్గేయకారుల కృతులు ఆలపించారు. ఈ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న, సంస్థ అధ్యక్షుడు గోపాల నర్సరాజు, తురగా సూర్యారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం



పెద్దాపురం శ్రీప్రకాష్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పెద్దాపురం: శారీరక పరిపుష్టికి యోగా దోహదపడుతుందని పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారులు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో జరిగిన యోగా కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివేకానంద కేంద్రం ప్రతినిధి సదాశివం, శ్రీప్రకాష్ విద్యా సంస్థల చైర్మన్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పులిమేరులో జరిగిన యోగా దినోత్సవ వేడుకలో పీఠాధిపతి సూర్యానందగిరి స్వామి మాట్లాడుతూ మానసిక ప్రశాంతత పెంచేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో పాఠశాలల నిర్వాహకులు రాయవరపు వీరబాబు ఆధ్వర్యంలో బుధవారం యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

దినచర్యలో యోగా భాగం కావాలి

సామర్లకోట: స్థానిక రైతు క్లబ్ భవనంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో యోగా గురువు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతిఒక్కరి దినచర్యలో యోగా భాగం కావాలన్నారు. బుధవారం స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో పాఠశాల హెచ్‌ఎం తోట కూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ పి.పుల్లయ్య మాట్లాడుతూ శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. అంతర్జాతీయ యోగా పోటీలకు ఎంపికైన తొమ్మిదో తరగతి విద్యార్థి కిల్లాడి యశ్వంత్ ప్రదర్శించిన యోగాసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



యోగాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ లతాకుమారి



విద్యార్థి యశ్వంత్ ప్రదర్శించిన యోగాసనం

ఆరోగ్య ప్రదాయిని యోగా

యోగా గురువు నాగేశ్వరరావు



యోగాసనాల విశిష్టతను వివరిస్తున్న యోగా గురువు నాగేశ్వరరావు

పిఠాపురం: మన పూర్వీకులు మనకు ప్రసాదించిన యోగా ఆరోగ్య ప్రదాయిని అని ప్రముఖ యోగా గురువు జ్యోతుల నాగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గొల్లప్రోలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన యోగాసనాల విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనలో దుర్లక్షణాలు నిర్మూలించి మనసులో మాలిన్యాలను శుద్ధి చేసి శరీరంలో అవరోధాలను తొలగించి దేహాన్ని దేహిని జీవనానంద సౌందర్యంలో ఓలలాడించేదే యోగా అన్నారు. అదే భారతదేశం ప్రపంచానికి అందించిన మహా యోగతంత్రం అని ఈ మహా యోగాన్ని ఒంటపట్టించుకున్న ప్రపంచం యోగా డే ని పాటించడం మన దేశానికే ఒక గర్వ కారణంగా నిలిచిందన్నారు. యోగాసనాల విశిష్టతను వివరించారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలను ఎదుర్కోడానికి యోగా మంచి మార్గంగా ఆయన అభివర్ణించారు. అందరు యోగా నేర్చుకుని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

ఎఫ్‌కే పాలెంలో

పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెంలో అమృత్ సరోవర్ చెరువు వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి హాజరై సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. యోగా విశిష్టతను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీడీలు వసంతమాధవి, ఎం.భానుప్రకాష్, ముమ్మిడిశేఖర్, జి.రమేష్, ఉపాధి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



నానిబాబు

పిఠాపురం: కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తన అత్తకి భోజనం తీసుకెళ్లిన యువకుడు అదృశ్యం అయినట్లు అతని బంధువులు తెలిపారు. మండలం విరవాడకు చెందిన దారా నానిబాబు మంగళవారం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తన అత్తకు క్యారేజీ ఇవ్వడానికి వెళ్లాడు. భోజనం ఇచ్చేసి కింద ఉంటానని బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడని అతని బంధువులు కాకినాడ వన్ టౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 90146 70187, 73966 21062 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

రౌతులపూడి: కత్తిపూడి– రౌతులపూడి రహదారిపై బంగారయ్యపేట వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. బంగారయ్యపేట గ్రామానికి చెందిన కరగాని లోవతల్లి బుధవారం తెల్లవారుజామున బహిర్భూమి కోసం ఏలేరు కాలువ వైపు తన కుమార్తె కొల్లుమేని వరలక్ష్మితో కలసి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని క్వారీ లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన లోవతల్లిని కుటుంబ సభ్యులు రౌతులపూడి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీంతో ఆ రహదారిలో రవాణా సాగిస్తున్న క్వారీ లారీలను గ్రామస్తులు నిలిపివేశారు. లోవతల్లిని ఢీకొట్టిన క్వారీ లారీ ఆచూకీ తెలిపి తమకు న్యాయం చేసే వరకూ లారీలను వదిలి పెట్టమని స్థానికులు తెలిపారు.